సాక్షి ప్రకాశం

బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



సోనాబోట్ల సమస్య పరిష్కారానికి కృషి

సముద్ర తీర ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా సంచరించే సోనా బోట్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌బాబు అన్నారు. - 8లో..



మట్టిపెళ్లలు విరిగిపడి..

రైల్వే బ్రిడ్జి పనుల్లో భాగంగా పాతకేబుల్ తొలగించేందుకు గుంత తీస్తుండగా మట్టిపెళ్లలు విరిగిపడి కూలీ మృతిచెందాడు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27/26

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీకృష్ణాష్టమిని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

ఒంగోలు: శ్రీకృష్ణ పరమాత్ముని పుట్టిన రోజు అయిన శ్రీకృష్ణాష్టమిని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్రమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావు, టీటీడీ పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. గోకులాష్టమిగా జరుపుకునే ఈ పండుగ రోజు ప్రజలు పవాస దీక్షలు, ఇళ్లలో ఊయల కీర్తనలతో, ఆలయాల్లో అష్టోత్తర, సహస్రనామ పూజలతో శ్రీకృష్ణభగవానుడ్ని భక్తిశ్రద్ధలతో పూజించాలన్నారు. ఉట్టి తదితర సంప్రదాయ కార్యక్రమాల్లో ఆనందంగా పాల్గొని సకలశుభాలు పొందాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు రాహుల్‌గాంధీ జోడో యాత్రకు సంఘీభావ యాత్ర

ఒంగోలు: రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం నగరంలో సంఘీభావ యాత్ర చేపడుతున్నట్లు జాతీయ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రకాశం భవనం వద్ద నుంచి అద్దంకి బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ వరకు ఈ సంఘీభావ యాత్ర జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తప్పక హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

చంద్రబాబు అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి



ఎమ్మెల్సీ పోతుల సునీత

ఒంగోలు: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణ చేయించి జైలుకు పంపాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశం భవన్‌లో మంగళవారం ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన ఆమె సమావేశం ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. అమరావతి నిర్మాణం పేరుతో వేలకోట్లను చంద్రబాబు దోచుకున్నారని విమర్శించారు. ఆదాయపు పన్నుశాఖ రూ.118 కోట్లకు నోటీసులు జారీచేసిందని, నిత్యం నానా రచ్చ చేస్తూ హంగామా సృష్టించే చంద్రబాబు, లోకేష్, దత్తపుత్రునితోపాటు పచ్చ మీడియా ఎందుకు మౌనం వహిస్తున్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. నోటీసులు జారీ అయితే కనీసం డిబేట్లు కూడా పచ్చమీడియా నిర్వహించకపోవడాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారని, పోలవరాన్ని ఏటీఎంలా మార్చుకున్నారని, ఈ క్రమంలోనే ప్రజలు విసిగి 2019 ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పారన్నారు. చంద్రబాబు నాయుడిపై ఎన్ని కేసులు నమోదైనా మానేజ్ చేసి స్టేలు తెచ్చుకోవడంలో నైపుణ్యాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. తెలంగాణలో ఓటుకు నోటు కేసులో దొరికిపోయి పదేళ్లపాటు రాజధానిగా హైదరాబాదులో ఉండే అవకాశం ఉన్నా కేవలం సొంత ఆదాయం కోసం అమరావతిని రాజధానిగా ప్రకటించుకుని దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది నిజం కాకపోతే వార్త ప్రచురించిన మీడియాపై పరువు నష్టం దావా వేయాలని సవాల్ విసిరారు. భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ, టీడీపీ షూరిటీ అంటూ మరో మారు మోసం చేసేందుకు టీడీపీ నాయకులు యత్నిస్తున్నారని, ప్రజలు తిప్పికొట్టాలన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏమాత్రం ఆర్థికంగా ఎదగలేకపోయారని, కేవలం మీడియా ద్వారా అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకుంటున్న నేపథ్యంలో సీబీఐ దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పచ్చమీడియా ఎన్ని కుట్రలు పన్నినా మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అన్నారు.



గురుపూజోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న టంగుటూరు మండలం వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు గేరా నివేదిత, తర్లుపాడు మండలం లింగారెడ్డికాలనీ ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం షేక్ మౌలాలీ, దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వీవీ రామాంజనేయులు, ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ కేపీ రంగనాయకులు, ఏకేయూ డీన్ డాక్టర్ డీ వెంకటేశ్వరరెడ్డి, పెద్దదోర్నాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సైన్స్ అధ్యాపకుడు డాక్టర్ నాగరాజు

చిత్తశుద్ధితో విద్యారంగ అభివృద్ధి

- భావి భారత నిర్మాణంలో గురువులదే కీలకపాత్ర
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- 53 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఒంగోలు సిటీ: విద్యా రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో మెరుగైన సమాజాన్ని రూపొందించడానికి ఉపాధ్యాయులు తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. విజ్ఞానం, నైతిక విలువలతో కూడిన భావి భారత నిర్మాణంలో గురువులదే కీలకపాత్ర అన్నారు. స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన భవన్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఆర్జేడీ, ఇన్‌చార్జ్ డీఈఓ వీఎస్. సుబ్బారావు అధ్యక్షత వహించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 53 మంది టీచర్లకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి ఆదిమూలపు సురేష్, ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, పీడీసీసీబీ చైర్మన్ వై.ఎం.ప్రసాదరెడ్డి పాల్గొన్నారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ విద్యాభ్యాసంతోనే సామాజికంగా, ఆర్థికంగా ముందడుగు వేయడం సాధ్యమవుతుందన్నారు. డాక్టరు బీఆర్.అంబేద్కర్ ఆలోచనకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాలుగేళ్లలో రూ.60 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయడమే ఇందుకు నిదర్శమన్నారు. మారుతున్న పరిస్థితులకు తగినట్లుగా విద్యారంగ బోధనలో సాంకేతిక విధానాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టడం, సబ్జెక్టు టీచర్ల నియామకం, ద్విభాషా (తెలుగు-ఇంగ్లిష్) పాఠ్యపుస్తకాల సరఫరా, హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ, బైజూస్ పాఠ్యాంశాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవడం వంటి విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చామన్నారు. నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని పెడుతున్నట్లు చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడకుండా అమ్మ ఒడి, విద్యాకానుక, ఉన్నత స్థాయిలో విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి మండలానికి రెండు జూనియర్ కాలేజీలు ఉండాలన్నది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనన్నారు. గతంలో ఎప్పుడూ లేని రీతిలో కొత్త మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం చూస్తుంటే అవకాశం లభిస్తే ఉపాధ్యాయునిగా వెళ్లాలనే ఆశ తనకు కలుగుతోందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పని చేయాలని, సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో మెరుగైన సమాజాన్ని రూపొందించడానికి పునరంకితం కావాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో 'ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ' ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కరోనా సమయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా నాడు-నేడు పనులకు ప్రాధాన్యం ఇచ్చి పాఠశాలల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అనేక పథకాలను అమలు చేయడం గొప్ప విషయమన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు మంచి నడవడికను నేర్పే గురువులే వారికి ప్రత్యక్ష దైవమన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే క్రమంలో వారిని సున్నితంగా మందలించడంలో తప్పు లేదు కానీ, వారిని ఆత్మ న్యూనతాభావంలోకి తీసుకెళ్లేలా ఉపాధ్యాయులు వ్యవహరించకూడదన్నారు. పాఠశాలలను తనిఖీ చేస్తున్న సమయంలో గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి విద్యే విలువైన ఆస్తి అన్నారు. విద్యార్థులందరినీ ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ దిశగా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో గురువుల పాత్ర ఎంతో విలువైనదని కొనియాడారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ విద్యతో పాటు విలువలతో కూడిన జీవితం ఎంతో ముఖ్యమన్నారు. గురువుల బోధన ద్వారానే ఉన్నత వ్యక్తిత్వం సాధ్యమవుతుందన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలోని ఒక్క మార్కాపురంలోనే దాదాపు రూ.4 కోట్లతో నాడు-నేడు పనులు చేపట్టినట్లు తెలిపారు.

మార్కాపురానికి మెడికల్ కాలేజీని కేటాయించడం ద్వారా మరింత మంది విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించే అవకాశం లభిస్తుందన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వివిధ రంగాల్లో గురువులు ఉన్నా బాల్యంలో మనకు విద్యాబుద్ధులు నేర్పే గురువులకు మనం ఇచ్చే గుర్తింపు ఎంతో గొప్పదన్నారు. తల్లి జన్మనిస్తే, గురువు జ్ఞానాన్ని ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.రవిబాబు, మైనార్టీస్ కార్పొరేషన్ డైరెక్టరు ఎస్.కె.మహబూబ్, సూర్య బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డి.కరుణాకర్, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ చెన్నకేశవ, ఇతర ప్రజాప్రతినిధులు ఆర్.ఐ.ఓ సైమన్‌విక్టర్, ఏ.ఎల్.ఎస్. కోఆర్డినేటర్ వి.సుబ్బారావు, పీఈవో సామా సుబ్బారావు, డిప్యూటీ డీఈఓ అనితా రోజ్‌రాణి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న వారితో మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు, మేయర్ గంగాడ సుజాత, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్, పక్కన జెడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, నాగార్జునరెడ్డి, ఎమ్మెల్సీ పోతుల సునీత, మేయర్ గంగాడ

ప్రజలకు సంపూర్ణ సేవలు అందించడమే ధ్యేయం

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ప్రజలకు సంపూర్ణ సేవలు అందించడమే తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను చివరి ఇంటి వరకు చేర్చేందుకు వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పుల్లలచెరువు మండలంలోని పిడికిటివానిపల్లె గ్రామంలో మంగళవారం రెండో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హత ఒక్కటే ప్రమాణికంగా తీసుకొని రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు చెందిన పేద ప్రజలు లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పథకాలు సక్రమంగా అందాయా, లేదా అని తెలుసుకోవటానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని, ఇంకా ఏమైనా సమస్యలుంటే ఈ కార్యక్రమంలో తక్షణమే పరిష్కరించుకునే అవకాశం ఉందని చెప్పారు. జగనన్న పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయని ఆయన మండిపడ్డారు. ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి ఆ తరువాత మోసం చేయడం ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకే చెందుతుందని, ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆయనతోపాటు ఆయన కుమారుడు లోకేష్, దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ రాష్ట్రంపై విరుచుకొని పడుతున్నారని అన్నారు. 14 ఏళ్లపాటు సీఎంగా వెలగబెట్టిన చంద్రబాబు ప్రజలకు చేసింది ఏమీలేదని, ఇప్పుడు తానేదో చేస్తానని అనడంలో నిజం లేదని రాష్ట్ర ప్రజలే బాహాటంగా చెప్తున్నారని అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారంలోకి వచ్చిన పచ్చ నాయకులు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో సైతం జన్మభూమి కమిటీల పేరుతో ప్రభుత్వ పథకాలకు రేటు పెట్టి డబ్బులు వసూలు చేసిన ఘనత వారికే దక్కుతుందని అన్నారు. ఐదేళ్ల టీడీపీనేతల పాలనలో విసుగు చెందిన రాష్ట్ర ప్రజలు 2019లో చక్కటి తీర్పు ఇచ్చారని, టీడీపీని అడ్రస్ లేకుండా చేశారని అన్నారు. 2024 అంతకంటే దారుణమైన అనుభూతిని పచ్చనాయకులు చూడనున్నారని చెప్పారు. జగనన్న సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన 4 సంవత్సరాల కాలంలో చెప్పిన వాగ్దానాలన్నీ నెరవేర్చారని, పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని అన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా తమ పిల్లలను బడికి పంపించే ప్రతి తల్లి అకౌంట్‌లో నేరుగా డబ్బులు జమ చేస్తున్నారని, దీనివలన పేద కుటుంబాలకు ఊరట కలిగిస్తుందని అన్నారు. తిరిగి జగనన్నే సీఎంగా చేసుకోవాలన్న తపనతో రాష్ట్ర ప్రజలు ఉన్నారని, మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినాదాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ నారు మస్తాన్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్యయాదవ్, మండల పార్టీ కన్వీనర్ కె ఓబులురెడ్డి, నాయకులు గాలిరెడ్డి, రమణయ్య, బసిరెడ్డి, గురువారెడ్డి, వెంకట నారాయణరెడ్డి, ఎం సుబ్బారెడ్డి, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్ కె.దాస్, ఎంపీడీవో కె.మరియదాసు, ఎంఈవో ఇందిరాప్రసాద్, ఏపీఎం వెంకటయ్య, జేఈఈలు ఆర్‌వీ సుబ్బయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

ఓటర్ల సవరణల్లో లోపాలుంటే చర్యలు

బేస్తవారిపేట/పొదిలి/పెద్దారవీడు/దొనకొండ: జిల్లాలో ఓటర్ల సవరణ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. మంగళవారం సాయంత్రం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.శ్రీనివాసులు పొదిలి మండలం కాటూరివారిపాలెంలో జరుగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల సవరణ పక్షపాతం లేకుండా జరగాలని, లోపాలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎవరు ఫిర్యాదు చేసినా, విన్నవించినా, పూర్తి స్థాయిలో పరిశీలన అనంతరం మాత్రమే చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట మార్కాపురం ఆర్డీవో నారదముని, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్ఐ కె.సుబ్బారావు ఉన్నారు.

బేస్తవారిపేట మండలంలో..

మండలంలోని సోమవారిపేటలో ఓటర్ల తొలగింపు జాబితాను ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. గ్రామంలో ఓటర్ల తొలగింపునకు ఫారం-7కు సంబంధించిన వివరాలు రెవెన్యూ అధికారుల నుంచి తీసుకున్నారు. జాబితాలోని పేర్లను పరిశీలించి వివాహం చేసుకుని వేరే ప్రాంతాలకు వెళ్లారా? మరణాలు ఉన్నాయా? గ్రామంలో నివాసం ఉండకుండా ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారా.. వంటి వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ డీవీబీ వరకుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నియమావళిని పాటించాలి:

ఎన్నికల కమిషన్ నియమావళిని కచ్చితంగా పాటించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు సచివాలయం పరిధిలో గతంలో ఓటర్లను తొలగించడంతో జాబితాలను పరిశీలన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన వెంట వెలిగొండ ప్రాజెక్టు ఎస్‌డీసీ, యర్రగొండపాలెం ఈఆర్‌ఓ పి చెన్నయ్య, తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

దొనకొండ మండలంలో..

దొనకొండ మండలంలోని ఆరవల్లిపాడు గ్రామంలో బీఎల్వోలు తహసీల్దార్ సువర్ణ సమక్షంలో ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయిలో తొలగించిన ఓటర్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు, దర్శి నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి వీఎస్సీ లోకేశ్వరరావుతో కలిసి ఓటర్లతో మాట్లాడి ఓట్లను తొలగించడానికి కారణాలను పరిశీలించారు.



దేవరాజుగట్టులో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు



సోమవారిపేటలో ఓటర్ల తొలగింపు జాబితాను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

ఆలయ భూముల రికార్డుల పరిశీలన

హనుమంతునిపాడు: మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశస్వామి గుడికి సంబంధించిన భూముల రికార్డులను దేవదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ ధర్మకర్త సానికొమ్ము రామ రాఘవరెడ్డి, సానికొమ్ము భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డిలు శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామికి సంబంధించిన 145 ఎకరాల భూమిని ఆక్రమించి అనుభవవించడంతోపాటు, 175 సర్వేనంబర్‌లో ఉన్న స్వామి వారి గర్భగుడిని కూడా సానికొమ్ము రత్నమ్మ భర్త సానికొమ్ము చెన్నారెడ్డి పేరు మీద ఆన్‌లైన్ ఎక్కించుకొని పట్టాదార్ పాస్ పుస్తకాలు తెచ్చుకున్నారని గ్రామస్తులు బత్తుల శ్రీనివాసులరెడ్డి, సానికొమ్ము కాశిరెడ్డి, సానికొమ్ము జగన్‌మోహన్‌రెడ్డిలు రాష్ట్ర దేవదాయ శాఖకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పరిశీలించి ఆలయ ధర్మకర్తలతో మాట్లాడారు. సంబంధిత పత్రాలు, ఆలయ రికార్డులు తీసుకొని దేవదాయ శాఖ కార్యాలయానికి రావాలని ఆదేశించారు. ఆయన వెంట ఆలయ ధర్మకర్తలు, ఫిర్యాదుదారులున్నారు.



గుడిని పరిశీలిస్తున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి

జలశక్తి అభియాన్ కేంద్ర బృందం పర్యటన

కనిగిరి రూరల్: జలశక్తి అభియాన్ కేంద్ర బృందం మంగళవారం కనిగిరి ప్రాంతంలో పర్యటించారు. కనిగిరి, పీసీపల్లి మండలాల్లోని వాటర్ షెడ్ స్కీంలను, మొక్కలను పరిశీలించారు. మండలంలోని గురువాజీపేటలో సుమారు 25 హెక్టార్లలో జరిగిన వాటర్ షెడ్ పనులు, కందకాలు, మొక్కల పెంపకం, కొండకాలువ నిర్మాణాలను జలశక్తి అభియాన్ కేంద్ర డైరెక్టర్ మనోజ్ బాప్న పరిశీలించి, తగు సూచనలు చేశారు. అలాగే చీర్లదిన్నె గ్రామంలో జరిగిన ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు.



గురువాజీపేటలోని వాటర్ షెడ్ పథకాన్ని పరిశీలిస్తున్న జలశక్తి అభియాన్ సెంట్రల్ టీం

క్లుప్తంగా

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక



టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.సిద్ధార్థ, డి.అవినాష్ గత నెలలో అనకాపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరు సెప్టెంబర్ 8వ తేదీ హర్యానాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ తుల్లిబిల్లి అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

ఆర్మీ జవాన్‌పై కేసు నమోదు

రాచర్ల: ఓ యువతిని ప్రేమ పేరుతో మోసం చేసిన ఆర్మీ జవాన్‌పై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రాచర్ల మండలంలోని అనుమలవీడు గ్రామానికి చెందిన పిన్నిక పవన్‌కుమార్ ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. సంగోపేట గ్రామానికి చెందిన ఒక యువతితో విద్యార్థి దశ నుంచే సన్నిహితంగా ఉంటున్నాడు. సెలవుపై వచ్చినపుడల్లా ఆ యువతితో చనువుగా ఉంటూ పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఈ క్రమంలో ఆ యువతి పవన్‌కుమార్‌ను కలిసి పెళ్లి చేసుకోవాలని గట్టిగా నిలదీసింది. పవన్‌కుమార్ ముఖం చాటేశాడు. తన తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోవడం లేదని, పెళ్లి చేసుకోలేనని తెగేసి చెప్పడంతో ఆ యువతి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కృష్ణపావని తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి



మృతిచెందిన రాములు

బేస్తవారిపేట: రైలు కిందపడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని జేబీకే పురం సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..జేబీకేపురానికి చెందిన పెద్దిశెట్టి రాములు(43) గత ఏడాది నుంచి మతిస్థిమితం లేకుండా గ్రామంలో తిరుగుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి విజయవాడ–హుబ్లీ ట్రైన్‌ను తగలడంతో తీవ్రంగా గాయపడి ట్రైన్ పట్టాల పక్కన మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు గ్రామంలో రాములు గురించి విచారించడంతో ట్రైన్ పట్టాల వైపు వెళ్లినట్లు చెప్పడంతో..అక్కడకు వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. దీంతో రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి తల్లిదండ్రులు బసవయ్య, పుల్లమ్మలు ఉన్నారు.

వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై జి.కృష్ణపావని

రాచర్ల: మండలంలోని అక్కపల్లె గ్రామ సమీపంలోని లోతువాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే.. కూరగాయలు అమ్ముకునే షేక్.మహమ్మద్ ఖాశింవలి (42) సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకుపోయాడు. అతని ఆచూకీ కోసం సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకూ గాలించినా ఫలితం లేకుండాపోయింది. మంగళవారం ఉదయం లోతువాగు ఉధృతి కాస్త దగ్గడంతో స్థానిక పోలీసులతో పాటు కుటుంబసభ్యులు గాలించగా లోతువాగులోని ముళ్లపొదల్లో చిక్కుకున్న షేక్.మహమ్మద్ ఖాశింవలి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్సై జి.కృష్ణపావని సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై జి.కృష్ణపావని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అనిల్

సింగరాయకొండ: ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ప్రమాదవశాత్తు మోటారుసైకిల్ ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని పోలేరమ్మగుడి సమీపంలో విమానాల రన్ వేపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని శానంపూడి గ్రామానికి చెందిన రావినూతల అనిల్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. టంగుటూరు వైపు నుంచి శానంపూడికి బైక్‌పై వెళ్తూ ముందున్న వాహనాన్ని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలవడంతో అపస్మారక స్థితికి చేరుకున్న అనిల్‌ను 108 వాహనంలో ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇతని పరిస్థితి ప్రమాదకరంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు.

చెన్నకేశవాలయానికి సరికొత్త శోభ

- 4 ఉప ప్రాకారాలతో ఆలయ అభివృద్ధి
- సుమారు 300 దేవతా విగ్రహాలతో ప్రాకారాల నిర్మాణం
- ఒక్కో రాజగోపురం ఎత్తు 75 అడుగులు
- రూ.8.50 కోట్ల వ్యయంతో ముమ్మరంగా పనులు



గోపురానికి మెరుగులు దిద్దుతున్న స్థపతి ప్రసాద్

మార్కాపురం టౌన్: శ్రీకృష్ణదేవరాయుల కాలం నాటి లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం మరింత శోభ సంతరించుకోనుంది. నాలుగు యుగాల చరిత్ర కలిగిన చెన్నకేశవస్వామి ఆలయానికి నాలుగు ఉప ప్రాకారాలు నిర్మిస్తుండటమే అందుకు కారణం. ఆలయానికి నలువైపులా 75 అడుగుల మేర ఎత్తున నిర్మిస్తున్న గోపురాల్లో దశావతారాలతోపాటు గోవింద నామాలతో కూడిన సుమారు 300 దేవతా మూర్తుల విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రాకారాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు శ్రీనివాస స్థపతి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన కందుకూరి పెంచల ప్రసాద్, బృంద సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నాలుగు ఉప ప్రాకారాల నిర్మాణంలో సుమారు 100 మంది కార్మికులు పాలుపంచుకున్నారు. బాపట్ల జిల్లా మార్టూరులో 75 మంది కార్మికులు గ్రానైట్ రాళ్లతో శిల్పాలు, ప్రాకార నిర్మాణాల పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా చెన్నకేశవస్వామి ఆలయంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన 25 మంది కార్మికులు శిల్పాలకు కొంతమేర మెరుగుపట్టి ప్రాకారాల్లో అమరుస్తున్నారు. రూ.8.50 కోట్ల వ్యయంతో పనులు చేపట్టామని, మరో మూడు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉందని ఆలయ కమిటీ పేర్కొంది.

ప్రతిష్టాత్మక ప్రాజెక్టు



శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ నాలుగు రాజగోపురాల నిర్మాణ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టాం. భక్తులు, దాతలు, దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిధులు సమకూరాయి. దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాజగోపురాల నిర్మాణాల్లో భాగంగా ఉపాలయాలు కూడా నిర్మిస్తున్నాం.

– ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



నిర్మాణంలో ఉప ప్రాకార గోపురం



క్రేన్ సాయంతో గోపురంపై శిల్పాలను అమరుస్తున్న కార్మికులు



గోపురాలకు ఉపయోగించే గ్రానైట్ రాళ్లు

డిసెంబర్ నాటికి పనులు పూర్తి



ఆలయంలో నాలుగు ఉప ప్రాకారాల నిర్మాణ పనులను ఈ ఏడాది చివరినాటికి పూర్తి చేస్తాం. టీటీడీ శిల్ప కళాశాలలో డిప్లమో పూర్తి చేసి, 20 ఏళ్లుగా వివిధ ప్రాంతాల్లో ఆలయాలు నిర్మిస్తున్నాం. రాజంపేటలో 108 అడుగుల తాళ్లపాక అన్నమాచార్యుల విగ్రహం, నెల్లూరు జిల్లాలోని అల్లూరులో పోలేరమ్మ దేవాలయం నిర్మాణం, శంషాబాద్‌లో చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో చేపట్టిన రామానుజ విగ్రహం వద్ద 108 దివ్యక్షేత్రాల్లో 378 విగ్రహాలు, 20 ఉపాలయాలు నిర్మించాం. ఆ అనుభవాన్ని చూసి ఇక్కడ పనులు అప్పగించారు.

– ప్రసాద్, స్థపతి

దాతల సహకారం మరువలేనిది



రాజ గోపురాల నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన రాగానే దాతలు అందించిన సహకారం అపూర్వం. స్వామివారి భక్తులు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు తమ వంతు సహకరిస్తున్నారు. ఇంకా సహకారం అందివ్వాలని కోరుతున్నాం.

– పెనుగొండ కేశవరావు, ఆలయ కమిటీ చైర్మన్

దశదిశలా ఆలయ కీర్తి



శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రూ.8.50 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తయితే ఆలయ కీర్తి దశదిశలా వ్యాపిస్తుంది. 4 ఉప ప్రాకారాలతోపాటు శిథిలావస్థకు చేరిన రంగ నాయకస్వామి, ఆండాల్ అమ్మవారి ఆలయాలను పునర్నిర్మిస్తున్నాం. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కృషితో దేవదాయ శాఖ నిధులు మంజూరు చేయడంతో పనులు వేగంగా సాగుతున్నాయి.

– శ్రీనివాసరెడ్డి, ఈఓ

కష్టమర్లుగా వచ్చి బ్యూటీపార్లర్లో చోరీ

- పార్లర్ నిర్వాహకురాలిపై దాడి చేసి దోచుకెళ్లిన ముగ్గురు మహిళలు



సీసీ ఫుటేజీలో నమోదైన అనుమానిత మహిళలు



గుర్తుతెలియని మహిళల దాడిలో గాయపడిన బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు రజియా

ఒంగోలు టౌన్: ఫేస్‌వాష్ చేయించుకుంటామని వచ్చిన ముగ్గురు మహిళలు అదునుచూసి బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలిపై దాడి చేసి అందినకాడికి దోచుకువెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నగరంలోని శ్రీకృష్ణనగర్‌లో షేక్ రజియా అనే మహిళ ఇంటి వద్దే బ్యూటీపార్లర్ నిర్వహిస్తుంది. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ముగ్గురు మహిళలు వచ్చి ఫేస్‌వాష్, ఐబ్రోస్ చేయించుకుంటామని చెప్పారు. దీంతో వారిని ఇంట్లోకి తీసుకెళ్లిన రజియా.. ఐ బ్రోస్ చేస్తుండగా ముగ్గురికీ పెడిక్యూర్ చేయాలని కోరారు. ఈ లోగా ఒక మహిళ బాత్రూమ్‌కువెళ్లిఆలస్యంగా వచ్చింది.
మిగిలిన వారు నమ్మకంగా మాట్లాడుతూ ఐ బ్రోస్ చేయించుకున్నారు. తరువాత ఒక మహిళకు పెడిక్యూర్ చేస్తుండగా రజియాపై ఒక్కసారిగా దాడికి దిగారు. దాడిలో రజియా మెడకు, కుడి చేతికి గాయాలయ్యాయి. అనంతరం మత్తు మందు చల్లడంతో రజియా స్పృహ కోల్పోయింది. కాసేపటికి తేరుకున్న రజియా ఇంట్లోకి వెళ్లి చూడగా ఆమె మెడలోని బంగారు నగలతో పాటుగా ఇంట్లోని కప్‌బోర్డులో దాచి ఉంచిన నగలు, రూ.40 వేల నగదు కూడా దోచుకొనిపోయినట్లు గుర్తించి తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.అంకమ్మ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో చైన్ చోరీ

మార్కాపురం: సిగరెట్ కావాలని వచ్చి మహిళ మెడలో చైన్ దొంగిలించిన సంఘటన స్థానిక తర్లుపాడు రోడ్డులోని వసంత్‌నగర్ ఏటీఎం వద్ద మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..బడ్డీ బంకు పెట్టుకుని జీవనం సాగిస్తున్న బోగెం ఆదిలక్ష్మి దగ్గరికి మంగళవారం సాయంత్రం మోటారు బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఒకరు బైక్ దిగి సిగరెట్ కావాలని అడగ్గా...ఆదిలక్ష్మి ఇస్తుండగా.. దుండగుడు ఆమె మెడలో నుంచి 3 తులాల గొలుసును లాక్కొని బైక్‌పై పరారయ్యారు. ఎస్సై శశికుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోనాబోట్ల సమస్య పరిష్కారానికి కృషి

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



పాకల తీరంలో సోనాబోట్లను పరిశీలిస్తున్న అశోక్‌బాబు, అధికారులు, నాయకులు

సింగరాయకొండ: సముద్ర తీరప్రాంత చట్టాల నిబంధనలకు విరుద్ధంగా తీరంలో చేపల వేట సాగిస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు బోట్ల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండలంలోని పాకల పంచాయతీ పోతయ్యగారి పట్టపుపాలెంలో మంగళవారం సోనాబోట్ల సమస్యపై మత్స్యశాఖ, మెరైన్, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరికూటి మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా తీరంలో చేపల వేట సాగించే సోనాబోట్లను అడ్డుకోవటానికి మన వద్ద కూడా సోనాబోటు అవసరమన్నారు. కొత్త బోటు సుమారు కోటి రూపాయలు, పాత బోటు అయితే సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందన్నారు. ప్రస్తుతం మత్స్యశాఖ అధికారుల వద్ద ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి జెడ్పీ నిధులతో సమకూర్చిన రూ.13 లక్షలు ఉన్నాయని, తాను మరో రూ.13 లక్షలు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. మిగిలిన నిధులను దాతల సహకారంతో సమకూర్చుకోవాల్సి ఉందన్నారు. ఈ బోటు వల్ల పాకల, ఊళ్లపాలెంలోని సుమారు 3 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. మత్స్యకారులు కూడా తమ వంతు ఆర్థిక సహకారం అందించాలని, ప్రతి కుటుంబం చందా ఇవ్వాలని కోరారు. చందాల సేకరణకు మత్స్యకార పాలేల నుంచి 9 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సోనా బోట్ల సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. నెల రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం చూపుతానని ధీమా వ్యక్తం చేశారు.
మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. సోనాబోట్ల సమస్య పరిష్కారానికి తమిళనాడు అధికారులతో చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, కడలూరు కలెక్టర్ ఇద్దరూ మంచి స్నేహితులని, ఇటీవల కడలూరు కలెక్టర్‌తోనూ మాట్లాడారని తెలిపారు. మన వద్ద కూడా సోనాబోటు ఉంటే వారు నిబంధనలు అతిక్రమించినప్పుడు అడ్డుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. సీఐ రంగనాథ్ మాట్లాడుతూ బోటు కొనుగోలుకు తన వంతు ఆర్థిక సహకారం అందిస్తానన్నారు. తీరానికి సోనాబోట్లు వచ్చాయన్న సమాచారంతో వరికూటి, అధికారులు తీరానికి వెళ్లి పరిశీలించారు. ఎస్సై టి శ్రీరామ్, మెరైన్ ఎస్సై షేక్ మస్తాన్ షరీఫ్, మత్స్యశాఖాధికారి ఎస్‌వీఎస్ వర్షిణి, ఎంపీటీసీలు గోళ్లమూడి అశోక్‌రెడ్డి, కొండూరి అంకయ్య, ఉప సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, గోళ్లమూడి సుందరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, రామచంద్రరావు, మాజీ సర్పంచ్ వాయిల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న రూత్‌మేరీ

మార్కాపురం రూరల్: అతి వేగంగా ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టడంతో భార్యాభర్తలతోపాటు కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మార్కాపురం మండలంలోని దరిమడుగు ఎస్సీ పాలెం వద్ద మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. యర్రగొండపాలెం మండలం పెద్దగుడిపాడు గ్రామానికి చెందిన వైదన మస్తాన్ తన భార్య రూత్‌మేరీ, కుమారుడు జమిత్రియతో కలిసి బైక్‌పై మార్కాపురం వస్తున్నారు. ఈ క్రమంలో మార్కాపురం నుంచి దోర్నాల వైపు వేగంగా వెళ్తున్న కారు దరిమడుగు వద్ద బైక్ ఢీకొట్టడంతో మస్తాన్‌కు ఎడమ కాలు, ఎడమచేతి వేలు విరిగిపోయాయి. భార్య రూత్‌మేరీ రెండు కాళ్లు విరిగిపోగా, కుమారుడు జమిత్రియకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేటకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మట్టిపెళ్లలు విరిగిపడి కూలీ మృతి

- మరో ఇద్దరు కూలీలకు గాయాలు
- రైల్వే పాత విద్యుత్ కేబుల్ తవ్వకాల సమయంలో ఘటన



మట్టిపెళ్లల కింద కూరుకుపోయి మృతి చెందిన చిత్తారి నారయ్య



పాతకేబుల్ తొలగించేందుకు తవ్విన గొయ్యి

సింగరాయకొండ: రైల్వే అభివృద్ధి పనుల్లో భాగంగా పాత కేబుల్ తొలగించేందుకు గుంతలు తీస్తుండగా మట్టి పెళ్లలు విరిగిపడి ఒక కూలీ మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం సింగరాయకొండ మండలంలో మన్నేరు బ్రిడ్జి సమీపంలో తూర్పువైపున చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండల పరిధిలో మూడో రైల్వే లైను అభివృద్ధి పనుల్లో భాగంగా పాత విద్యుత్ కేబుల్ తొలగింపు పనులు చేపట్టారు. ఇందుకోసం నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం పాజర్ల గ్రామానికి చెందిన చిత్తారి నారయ్య(50), ఉమ్మడిపోలు మాల్యాద్రి, కాకర్లపూడి సుబ్బరాజు పనిచేస్తున్నారు. వీరు ముగ్గురూ కలిసి సుమారు 10 అడుగుల లోతు ఉన్న కేబుల్‌ను తొలగించేందుకు గుంత తవ్వారు. అయితే ఒక్కసారిగా మట్టిపెళ్లలు జారిపడటంతో ముగ్గురూ గోతిలో పడిపోయారు. చిత్తారి నారయ్య మట్టిపెళ్లల కింద పూర్తిగా కూరుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందారు. మిగిలిన ఇద్దరూ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. క్షతగాత్రులిద్దరినీ 108 వాహనంలో కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై టి.శ్రీరామ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జేసీబీ సాయంతో మృతదేహాన్ని బయటకు తీసే ప్రయత్నం చేశారు. అయితే మృతుడి తరఫువారు నష్టపరిహారం ఇస్తేనే మృతదేహాన్ని బయటకు తీయాలని భీష్మించారు. దీంతో వారికి పోలీసులు నచ్చజెప్పి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ప్రమాదం రైల్వే స్థలంలో సంభవించడంతో ఆర్పీఎఫ్ అధికారులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని ఒంగోలు రైల్వే ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్

చీమకుర్తి నగర పంచాయతీ

ఇన్‌చార్జి చైర్మన్‌గా ‘బాపతు’



ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరిస్తున్న వెంకటరెడ్డి

చీమకుర్తి: చీమకుర్తి నగర పంచాయతీ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాపతు వెంకటరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన చల్లా అంకులు అనారోగ్య కారణాలతో తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు వైస్ చైర్మన్‌గా ఉన్న బాపతు వెంకటరెడ్డిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఇన్‌చార్జిగా ప్రతిపాదించగా సభ్యులు ఆమోదం తెలిపారు. తొలుత చైర్మన్ రాజీనామాను సభ్యులు ఆమోదించారు. ఈ వివరాలను కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు పంపించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఎన్నికల కమిషన్‌కు, తద్వారా కలెక్టర్‌కు సమాచారం వచ్చిన తర్వాత ఎన్నికల నిబంధనల మేరకు అర్హత కలిగిన వ్యక్తిని చైర్మన్‌గా ఎన్నుకుంటారని కమిషనర్ తెలిపారు. ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన బాపతు వెంకటరెడ్డికి పలువురు కౌన్సిలర్లు, కమిషనర్, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.